ఫీవర్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి వైద్య పరీక్షల నిర్వహణ

కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారికి వైద్య పరీక్షలు

అంబర్‌పేట, ఫిబ్రవరి 1: పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికైన వారికి నల్లకుంట లోని ఫీవర్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి రోజు వంద మంది చొప్పున 400 మందికి ఇక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దవాఖాన సూపరింటెండెంట్ డా.కె.శంకర్, జాయింట్ సీపీ సత్యనారాయణ, నల్లకుంట ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రావుల ఆధ్వర్యంలో ఫీవర్ లోని ఆడిటోరియంలో డాక్టర్లు ఈ పరీక్షలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు ఇవి జరుగనున్నాయి. ఈ సందర్భంగా వారికి బీపీ, జనరల్ పరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ, కలర్ బ్లైండ్‌నెస్, చెస్ట్, బ్లడ్ గ్రూపు, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించిన అనంతరం ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌ను ఇస్తారు. నాలుగు బృందాలు ఈ వైద్య పరీక్షల్లో పాల్గొంటున్నాయి.

అనుబంధాలకు ప్రాధాన్యత.. జోస్ అలుక్కాస్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 5: జోస్ అలుక్కాస్ రాబోయే వాలంటైన్స్ డే సందర్భంగా సరికొత్త ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. ప్రేమానుబంధాలు ప్రధాన కథాంశంగా తెలుగు, మళయాళం, తమిళం, కన్నడ భాషల్లో 'ఎంబ్రాసింగ్ డీప్ లవ్' అనే యాడ్ ఫిల్మ్‌ను రూపొందించారు. జోస్ అలుక్కాస్ అన్ని షోరూమ్‌లలో ప్రదర్శించబడే ఈ ప్రత్యేక వాలెంటైన్స్ కలెక్షన్ రూ.6,500 నుంచి ప్రారంభమవుతుందని ఒక ప్రకటనలో వెల్లడించారు. డైమండ్ ఫెస్ట్‌లో భాగంగా వజ్రాభరణాలపై 25 శాతం వరకు తగ్గింపును, ప్లాటినంపై 7 శాతం వరకు తగ్గింపును వినియోగదారులు పొందవచ్చని తెలిపారు. అదనపు ప్రత్యేక ఆఫర్లుగా బంగారు ఆభరణాల తరుగు ఛార్జీలపై 50 శాతం వరకు తగ్గింపు ఉంటుందని తెలిపారు. పాత బంగారు ఆభరణాలను వజ్రాభరణాలకు ఎక్స్‌ఛేంజ్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. అనుబంధాలకు నిరంతరం ప్రాధాన్యత నిచ్చే సంస్థగా ప్రసిద్ధి చెందిన జోస్ అలుక్కాస్ తాజా ప్రచార చిత్రం ద్వారా వాటిని మరింత బలోపేతం చేసే దిశగా దృశ్య రూపాన్ని ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఆప్తులకు, ఆత్మీయులకు, ప్రియులకు వివిధ డిజైన్లలో వజ్రాభరణాలను బహుమతిగా ఇచ్చే అవకాశాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు.

నాసా సంస్థ డిజైన్ కాంపిటేషన్లో.. ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 5: నేషనల్ స్పేస్ సొసైటీ నిర్వహించిన 'లివ్ ఇన్ ఎ హెల్తీ స్పేస్' డిజైన్ కాంపిటీషన్‌లో శ్రీ చైతన్య వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. అమెరికా నాసాకు చెందిన ఈ సంస్థ 12 నుంచి 18 ఏండ్ల విద్యార్థులకు స్పేస్ సెటిల్‌మెంట్‌లో అగ్రికల్చర్ మాడ్యూల్ డిజైన్ మీద ప్రపంచ వ్యాప్తంగా తొలిసారి ఈ తరహా పోటీలు నిర్వహించింది. దీనికి సంబంధించిన ఎన్ఎస్ఎస్ సోమవారం ఫలితాలను ప్రకటించగా, ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 47 ప్రాజెక్ట్‌లలో 28 ప్రాజెక్ట్‌లు శ్రీ చైతన్య నుంచే ఎంపికయ్యాయని, ఫలితాల పరంగా దేశ వ్యాప్తంగా క్లీన్ స్వీప్ రిజల్ట్ సాధించామని శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరల్డ్ 1లో 5, వరల్డ్ 2లో 8, వరల్డ్ 3లో 9, హానరబుల్ మేన్షన్స్‌లో 6 ప్రాజెక్ట్‌లతో ప్రపంచంలోనే భారతదేశంతో మరే ఇతర దేశాలలోని విద్యా సంస్థలు 10 శాతం ఫలితాలను కూడా సాధించలేదని వెల్లడించారు. శ్రీ చైతన్య బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలుకుతూ కాన్సెప్చ్యువల్ టీచింగ్ మెథడాలజీ, యాక్టివిటీస్, ప్రాక్టికల్ ఓరియెంటెండ్ టీచింగ్ ద్వారా మాత్రమే తాము ఇంతటి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఈ విజయానికి కారకులైన విద్యార్థులకు, అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ప్రొ. సీతారామారావు

విద్యతో పాటు నైపుణ్యం ప్రధానం

- విద్యార్థులను ఉద్దేశించి వీసీ ప్రొ. సీతారామారావు
- అంబేద్కర్ వర్సిటీలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ)/ బంజారాహిల్స్ : విద్యార్థికి విద్యతో పాటు నైపుణ్యం ప్రధానమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కే సీతా రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం 'సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్' అనే అంశంపై నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికంగా కూడా పరిజ్ఞానం కలిగి ఉంటే దేశంలో ఉపాధికి కొదువ ఉండదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. అంబేద్కర్ వర్సిటీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడాలనే ఉద్దేశ్యంతో ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ. ఏవీఆర్ రెడ్డి, మ్యూజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ప్రొగ్రామ్ మేనేజర్ టీ వెంకట్ రావు, యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి వృత్తి ప్రణాళిక కేంద్రం ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ డా. డి రవీంద్రనాథ్ సోలమన్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కేఎల్ డీమ్డ్ టు బీ వర్సిటీ వీసీ, డాక్టర్ పార్థ సారథివర్మ

కేఎల్‌హెచ్‌తో చేతులు కలిపిన ఐఆర్ఎంఏ

మాదాపూర్, ఫిబ్రవరి 5: నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యం నిర్మాణ వర్క్ షాపు కొరకు కేఎల్‌హెచ్ హైదరాబాద్ ఐఆర్ఎంఏతో చేతులు కలిపి ఒప్పందం కుదుర్చుకుంది. కేఎల్‌హెచ్ (హైదరాబాద్), ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ (ఐఆర్ఎంఏ) ఇటీవల జన్ శిక్షన్ సంస్థాన్ (జెఎస్ఎస్) సిబ్బంది కొరకు మూడు రోజుల బిల్డింగ్ వర్క్ షాపును నిర్వహించింది. కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వీసీ, డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ, అత్యాధునిక పరిజ్ఞానం, నైపుణ్యాలతో సిబ్బందిని సన్నద్ధం చేయడం ద్వారా నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి, ఉపాధిని సృష్టించే ప్రభుత్వ ఆలోచనలకు మద్దతు ఇవ్వడం మా కేఎల్ విశ్వవిద్యాలయం లక్ష్యమన్నారు. గ్రామీణ యువతకు వృత్తి, శిక్షణ ద్వారా సాధికారత కల్పిస్తున్నదన్నారు. ఈ విధానంతో వ్యక్తిగత అవకాశాలను పెంపొందించడమే కాకుండా గ్రామీణ ప్రాంతంలోని సంఘాలు, ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడంలో దోహదం చేస్తున్నదన్నారు. కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ నుంచి ఫ్యాకల్టీ సభ్యులు వారి సంబంధిత రంగాలలో తాజా సాంకేతికలు పురోగతిలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

బల్మూరిని ఓయూ గడ్డపై అడుగుపెట్ట నివ్వం: దశరథ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 5: ఉస్మానియా యూనివర్సిటీ పోరాట పటిమను చీర, గాజులతో అవమానించిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను పవిత్రమైన గడ్డపై కాలుమోపనీయబోమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ స్పష్టం చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, సామాజిక, రాజకీయ, విప్లవ పోరాటాలకు వేదికైన ఓయూను అవమానించిన బల్మూరికి ఈ గడ్డపై కాలుమోపే అర్హత లేదన్నారు. ఓయూకు రావాలనుకుంటే ముందుగా ఎన్‌సీసీ గేటు దగ్గర ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పి క్యాంపస్‌లోకి అడుగు పెట్టాలని సూచించారు. లేని పక్షంలో ఆయనను లోపల అడుగు పెట్టనివ్వబోమని హెచ్చరించారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు అంతా ఉద్యమించాలి

- అంబేద్కర్ యువత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండారు వీరబాబు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 5: రాజకీయాలకు అతీతంగా అసెంబ్లీలో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహ ఏర్పాటు కోసం జరుగుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండారు వీరబాబు పిలుపునిచ్చారు. అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుందో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మహనీయులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. విగ్రహ ఏర్పాటు కోసం ఉద్యమిస్తున్న కవితక్క స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు.

ఖబడ్దార్.. రేవంత్..!

హద్దు.. మీరొద్దు

తెలంగాణ ధీరోదాత్తుడు.. కేసీఆర్

అవాకులు చవాకులు పేలితే.. ప్రజలే బుద్ధి చెబుతారు: బీఆర్ఎస్ శ్రేణులు

నగరంలో పలుచోట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మల దహనం

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

''బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించేది లేదని నగర బీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. కేసీఆర్ పట్ల రేవంత్‌రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం నగర వ్యాప్తంగా పలు కూడళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశారు. అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ముందు సగటు మనిషి అవసరాలు తీర్చాలని, ఆ తరువాత ఏదైనా మాట్లాడుకోవచ్చని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు రేవంత్ రెడ్డికి హితబోధ చేశాయి. సమైక్యాంధ్ర పాలకుల చేతిలో దగాపడిన తెలంగాణను రాష్ట్ర అవతరణ అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అహర్నిషలు అభివృద్ధి కోసం పాటుపడిందని, అది నిజం కాదా? లేక కండ్లు మూసుకుపోయాయా? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేండ్లల్లో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు కేసీఆర్ చేసిన కృషిని అప్పుడే మరిచిపోయారా? తెలంగాణ ధీరోదాత్తుడు.. కేసీఆర్ అని, దేశంలోనే తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత కేసీఆర్‌ది కాదా? అంటూ ప్రశ్నించారు. అధికారం ఉంది కదా..! అని అడ్డగోలుగా కేసీఆర్‌పై అవాకులు చవాకులు పేలితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఖబడ్దార్ రేవంత్ రెడ్డి! అంటూ హెచ్చరించారు. కేసీఆర్ సార్ పట్ల మర్యాద లేకుండా మాట్లాడితే.. రేవంత్‌కు తెలంగాణ ప్రజలే బుద్ధి చెబుతారని, అందుకు సిద్ధంగా ఉండమని అన్నారు.''

ఉస్మానియాలో..

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రమేశ్ గౌడ్, మిథున్, రామకృష్ణ, నాగేందర్ రావు, అవినాశ్, శ్రీను నాయక్, సంపత్, ప్రశాంత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో రేవంత్ దిష్టి బొమ్మం దహనం

ఫిలింనగర్ కొత్త చెరువు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు దుర్గం ప్రదీప్ కుమార్

షేక్‌పేట్: కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును దుర్భాషలాడిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్ డివిజన్ ఫిలింనగర్ కొత్త చెరువు సమీపంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దహనం చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షులు దుర్గం ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గౌరీ శంకర్, ఎల్లేశ్, లక్ష్మణ్, రాజ్ కుమార్, కన్నా, సత్యనారాయణ పాల్గొన్నారు.

షాపూర్‌నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

షాపూర్‌నగర్ చౌరస్తాలో..

దుండిగల్: షాపూర్‌నగర్‌లోని సాగర్ హోటల్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు దూది మెట్ల సోమేశ్ యాదవ్, గాజుల రామారం, జగద్గిరిగుట్ట, సుభాశ్‌నగర్ డివిజన్‌ల అధ్యక్షులు భాస్కర్, అశోక్, శ్రీకాంత్‌తో పాటు ఎత్తరి మారయ్య, అడ్వకేట్ కమలాకర్, రవి కుమార్, ఇస్మాయిల్, శశి, కిరణ్ పాల్గొన్నారు.

పూలే విగ్రహ డిమాండ్‌ను ప్రభుత్వం గౌరవించాలి

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి
- యూపీఎఫ్ అడహక్ కమిటీ ఎన్నిక

యునైటెడ్ పూలే ఫ్రంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు మధుసూదనాచారి, గౌలి శంకర్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5: మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బీసీ హక్కుల సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన యునైటెడ్ పూలే ఫ్రంట్ నూతన కమిటీని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ జ్యోతి రావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అసమానతలు లేని సమాజ నిర్మాణానికి, పేద, బడుగు వర్గాలు గౌరవప్రదమైన జీవితాన్ని గడుపాలన్న సంకల్పంతో ఆయన అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. జ్ఞానమే సకల సమస్యలకు పరిష్కారమని గ్రహించిన పూలె ఆ దిశగా పని చేశారన్నారు. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలె స్త్రీ విద్యకు ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. చట్టసభల్లో ఉన్న వారికి ఆరాధ్యుడైన పూలె విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని, సమాజం నుంచి మంచి డిమాండ్ వచ్చినప్పుడు పాలకులు దానిని స్వీకరించాలన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, కవి, రచయిత జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ కాళ్లకు గజ్జెలు కట్టిన కళాకారుల నుంచి కవులు, రచయితలు బీసీ హక్కుల సాధన కోసం పనిచేస్తారన్నారు. అందరి కోసం కలం పట్టామని, గొంతులు పగిలేలా అరిచామని, కాని నేడు మా కోసం నినదిస్తామన్నారు. యునైటెడ్ పూలె ఫ్రంట్ రాష్ట్రంలోని రెండున్నర కోట్లకు సంబంధించిన బీసీల గొంతుకగా నిలుస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బీసీల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని యూపీఎఫ్ నూతన కన్వీనర్ గట్టు రామచందర్ అన్నారు. అసెంబ్లీలో పూలె విగ్రహ స్థాపనే లక్ష్యంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సారథ్యంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఈ నెల 12న ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా చేస్తామని తెలిపారు.

పూలే ఫ్రంట్ నూతన కమిటీ

యునైటెడ్ పూలే ఫ్రంట్ నూతన కమిటీ సలహాదారులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కన్వీనర్‌గా గట్టు రామచంద్రరావు, కో కన్వీనర్లుగా తాడూరి శ్రీనివాస్, కాసాని వీరేశ్ ముదిరాజ్, ఆర్‌జేసీ కృష్ణ, రాజారాం యాదవ్, బోల్ల శివశంకర్, కోల శ్రీనివాస్ , ముప్పు బిక్షపతి, రాచమల్ల బాలకృష్ణ, రాగిపెల్లి రవీంద్ర చారి, ఆర్వీ మహేందర్, ప్రచార కార్యదర్శిగా ఏరుకొండ నర్సన్న, యూత్ వింగ్ కన్వీనర్‌గా ఆలకుంట హరిబాబు, విద్యార్థి విభాగం కన్వీనర్‌గా ఏల్చల దత్తాత్రేయ, కో కన్వీనర్లుగా అశోక్ యాదవ్, బొడ్డుపల్లి లింగం, మహిళా విభాగం కన్వీనర్లుగా బాలమణమ్మ, గీతా గౌడ్, బొమ్మ ప్రవళికలు ఎన్నికయ్యారు.

పెంపుడు కుక్కలను కేబీఆర్‌లోకి తీసుకురావొద్దు

- పార్కులో కొనసాగుతున్న మరిన్ని మౌలిక, సుందరీకరణ పనులు
- అసంపూర్తిగా ఉన్న పనులను వేగిరం చేయాలని కమిషనర్ ఆదేశాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): కేబీఆర్ పార్కులో అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ పార్కును జోనల్, అడిషనల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పార్కును పరిశీలించారు. గతంలో చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. పార్కులో మరిన్ని మౌలిక వసతులు, సుందరీకరణకు పలు సూచనలు చేశారు. సందర్శకులకు, వాకర్స్‌కు తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెంపుడు కుక్కలను యాజమానులు తీసుకుని రాకుండా చర్యలు తీసుకోవాలని, పెంపుడు కుక్క రోడ్డుపైన మలినం చేయడం ద్వారా వాకర్స్ ఇబ్బంది పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. టాయిలెట్‌కు అనువైన స్థలాన్ని గుర్తించి నిర్మించాలని, అక్కడక్కడ లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలని ఎస్ఈ రత్నాకర్‌ను ఆదేశించారు. మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఇంతకు ముందు పార్కు అభివృద్ధికి చేపట్టిన పనులను పూర్తి చేయడంతో పాటు సుందరీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్ రవికిరణ్, యూబీడీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ సునందా రాణీ, ఎస్ఈ రత్నాకర్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ బీఫ్ రేషనింగ్ అధికారిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన జి.ఫణీంద్రారెడ్డి

- సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ)

టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా ఫెడరేషన్ కార్యవర్గం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5: తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా ఫెడరేషన్ నూతన కార్యవర్గం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో సోమవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు కొయ్యలమూడి రాకేష్, ప్రధాన కార్యదర్శి పుట్టా విజయ్ కుమార్, కోశాధికారి కర్రా నరేందర్ రెడ్డి. ఉపాధ్యక్షులుగా మోహన్ రాజ్, రమేష్ మాస్టర్, అదనపు లేబర్ కమిషనర్ గంగాధర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్ కుమార్, టెలివిజన్ డిజిటల్, ఓటీటీ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ చైర్మన్ ప్రసాదరావు, తెలుగు ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్. దొర పాల్గొన్నారు.

దూరవిద్య ఎంబీఏ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 5: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంబీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొ. రాములు తెలిపారు. ఎంబీఏ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారన్నారు.

వృద్ధాప్య పింఛన్ల కోసం పడిగాపులు

వారం పూర్తి అయినా పింఛన్లు రాలేదని వృద్ధులు సోమవారం గోల్కొండ తానీల్దార్ కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి చూశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి నెలా 28న బ్యాంకు ఖాతాలో డబ్బులు పడేవని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ల కోసం ననెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందంటున్నారు. - మెహిదీపట్నం ఫిబ్రవరి 5



నానక్‌రాంగూడలోని టీ ఫైబర్ కార్యాలయాన్ని సందర్శించిన కేంద్ర ప్రభుత్వ టెలీ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ తదితరులు

టీ ఫైబర్ సేవల పరిశీలన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ టెలీ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ నానక్‌రాంగూడలోని టీ ఫైబర్ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఫైబర్ టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటింటికీ ఇంటర్‌నెట్ కనెక్షన్లు ఇచ్చేందుకు చేపట్టిన టీ ఫైబర్ కార్యకలాపాలను ఆయన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్‌తో కలిసి పరిశీలించారు. నానక్‌రాంగూడలో ఉన్న తెలంగాణ నెట్‌వర్క్ ఆపరేషన్ కంట్రోల్ (టీ-ఎన్ఓసీ) కేంద్రంలో వ్యవస్థను కంప్యూటర్ స్క్రీన్‌లపై టీ ఫైబర్ అధికారులు నీరజ్ మిట్టల్‌కు వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు మొదలుకొని గ్రామ పంచాయతీల వరకు ఫైబర్ కేబుల్‌ను ఏర్పాటు చేసి, దానికి సంబంధించిన టెస్టింగ్ పనులు జరుగుతున్నాయని, కార్యక్రమంలో టీ ఫైబర్ ఇన్‌చార్జి మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ రావు కాసుల, టీ ఫైబర్ ఉద్యోగులు పాల్గొన్నారు.